14.5 కిలోల గంజాయి పట్టివేత

పాచిపెంట : అక్రమంగా తరలిస్తున్న 14.5 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు. ఆయన అందించిన వివరాలు ప్రకారం.. మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్ట్ నుంచి చాపరాయివలస గ్రామ సందర్శన నిమిత్తం సిబ్బందితో కలిసి వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు లగేజీ బ్యాగులతో తుప్పల వైపు వెళ్తుండగా అనుమానం వచ్చి వారిని పట్టుకున్నారు. లగేజ్ బ్యాగులు తనిఖీ చేయగా, అందులో 14.5 కిలోల గంజాయి లభ్యమైంది. వెంటనే ఈ విషయం తహశీల్దార్‌కి సమాచారం అందించి వారి సమక్షంలో గంజాయిని తూకం వేసి నిందుతులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచగా కోర్టు వారు వారికి 14 రోజులు రిమాండ్ విధించింది. వీరు ఒడిశాలోని సిమిలిగూడ నుంచి వైజాగ్ తరలిస్తున్నారని, ముగ్గురులో ఒక వ్యక్తి ఉత్తరప్రదేశ్‌కి చెందినవాడు కాగా, ఇద్దరమ్మాయిలు ఒడిస్సా సిమిల గూడ గ్రామానికి చెందినవారు అని ఎస్ఐ తెలిపారు.

- మన్యం జిల్లాలో 52కు చేరిన దుకాణాలు
- విజయనగరంలో 153 మద్యం షాపులు
- 9 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఎంఎ నాయుడు కన్వెన్షన్ హాలులో లాటరీ
- లైసెన్స్ పరిమితి 2026 సెప్టెంబర్ 30వరకే

ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటుకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వ మద్యం షాపులు రద్దయ్యాయి. ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటు, పెంపు, ధరలు, దరఖాస్తుల స్వీకరణ, లైసెన్సు ఫీజులు తదితర అంశాలపై ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. దీని ప్రకారం విజయనగరం జిల్లాలో నాలుగు దుకాణాలు పెరిగాయి. దీంతో, ఇప్పటి వరకు 149గా ఉన్న మద్యం దుకాణాల సంఖ్య 153కు చేరింది. మన్యం జిల్లాలో కొత్త, పాత కలుపుకుని 52 ఏర్పాటు కానున్నాయి. వీటికి సంబంధించి రెండు జిల్లాల్లోనూ ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. విజయనగరం జిల్లాలో 10, పార్వతీపురం మన్యం జిల్లాలో 5చొప్పున ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. జిల్లా పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరుగా గానీ, ఆన్‌లైన్ పద్ధతిలోగానీ దరఖాస్తులు చేసుకోవచ్చు. 9వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్ కూడా ఆ సమయం వరకు అందుబాటులో ఉంటుంది. ఒక దుకాణానికి ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. అలాగే ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులో పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ నమోదు చేయాల్సి వుంటుంది. దరఖాస్తుతో పాటు రూ.2లక్షల విలువ గల డిడి లేదా చెక్కును జతపర్చాలి.నాలుగు కేటగిరీల్లో దుకాణాలు ఏర్పాటు చేయ నున్నారు. జనాభా ప్రాతిపదికన వీటిని విభజించినట్టు డిసి బాబ్జీరావు తెలిపారు. కేటగిరిని బట్టి లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి వుంటుంది. నిర్ధేశించిన దుకాణం పరిధిలో 10వేల లోపు జనాభా ఉంటే లైసెన్సు ఫీజు రూ.50లక్షలు చెల్లించాల్సివుంటుంది. 10వేల నుంచి 50వేల లోపు జనాభా అయితే రూ.55లక్షలు, 50వేల నుంచి 5లక్షల లోపు జనాభా గలిగిన దుకాణానికి రూ.65లక్షలు, 5లక్షల జనాభా పైబడిన దుకాణాలకు రూ.85లక్షల చొప్పున ప్రభుత్వానికి లైసెన్సు ఫీజు చెల్లించాల్సివుంటుంది. ఈ సొమ్మును మొత్తం ఆరు వాయిదాల్లో చెల్లించుకోవచ్చు. ఒక ఏడాది తరువాత 10శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ లైసెన్సుకు రెండేళ్ల కాలపరిమితి కూడా ప్రభుత్వం విధించింది. 2026 సెప్టెంబర్ 30తో ముగియనుంది. కార్పొరేషన్ పరిధిలోని దుకాణాలు ఆ నగరానికి 5కిలో మీటర్లలోపు ఎక్కడైనా పెట్టుకోవచ్చు. మున్సిపాల్టీ పరిధికి 2కిలో మీటర్లలోపు పెట్టుకునేందుకు అవకాశం ఉంది. గ్రామాల్లో అయితే, ఆ దుకాణం పరిధిలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు.

52 మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల : కలెక్టర్

పార్వతీపురం : జిల్లాలో 52 మద్యం దుకాణాల కేటాయింపునకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పార్వతీపురం, పాలకొండ, కురుపాం, సాలూరు, సీతానగరం ఎక్సైజ్ స్టేషన్లు పరిధిలో గల 52 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించ బోతున్నామ న్నారు. ఈనెల 3 నుంచి 9 వరకు కార్యాలయ పనిదినాల్లో దరఖాస్తులు స్వీకరించను న్నామని, 11న ఎంఎ నాయుడు కన్వెన్షన్ హాలులో షాపుల కేటాయింపులు ప్రక్రియ చేపట్టనున్నట్టు తెలిపారు.గుర్తింపు పొందిన బ్యాంకుల్లో తీసుకున్న రూ.2లక్షల డిమాండ్ డ్రాఫ్టును ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పేరున తీసుకుని రెండు పాసుపోర్టు సైజు ఫోటోలు తీసుకొనిరావాలని తెలిపారు. వారికి వెంటనే ఎంట్రీ పాసు అందజేస్తామన్నారు. షాపులు కేటాయింపులు పొందిన వారు నిర్ణయించిన ధరలో ఆరవవంతు వెంటనే చెల్లించాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ప్రొహిబిషను అండ్ ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాధుడును కలెక్టరు ఆదేశించారు. అప్లికేషను కౌంటరులో డిజిటల్ అసిస్టెంటు, బ్యాంకు ఉద్యోగిని నియమించా లన్నారు. శాంతి భద్రతలు సమస్య లేకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. భద్రతా చర్యలు పాటిస్తూ, పూర్తిగా పారదర్శకంగా జరగాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావివ్వక అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యాన దీక్షలు

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

విశాఖ ఉక్కు పరిశ్రమని ప్రయివేటీకరణ బిజెపి కుయుక్తులకు పాల్పడుతుంటే టిడిపి, జనసేన, వైసిపి కపట నాటకాలు ఆడుతున్నాయని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి విమర్శించారు. విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యాన విశాఖ ఉక్కు పరిరక్షణకై చేపట్టిన దీక్షలనుద్దేశించి మంగళవారం కృష్ణమూర్తి మాట్లాడారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఆఫీస్ ఎదుట రిలే దీక్ష చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు అధ్యక్షతన జరిగిన దీక్ష శిబిరానికి సిఐటియు, ఎఐటియుసి, అఖిల భారత గ్రామీణ కార్మిక సంఘాల నాయకులు వై. మన్మధరావు, కె.జీవ, సూరయ్య, సిపిఎం, సిపిఐ పార్టీల జిల్లా కార్యదర్శులు రెడ్డి వేణు, కె.మన్మధరావు సంఘీభావం తెలిపారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తికి ఇనుప ఖనిజంతో పాటు బొగ్గు కావాలని, స్టీలు ప్లాంటుకు బొగ్గు సరఫరా కాకుండా కుట్రలు చేసింది బిజెపి, దాని మిత్రపక్ష పార్టీలేనని అన్నారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో రెండు మూత పడిపోయాయని, స్టీలు ప్లాంటులో పని చేస్తున్న 4వేల మంది కార్మికులను పని నుంచి నిలిపేసిందని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌ను కార్పొరేట్ మిత్రులకు అమ్మేస్తాం, లేకుంటే ప్లాంటును పూర్తిగా చంపేస్తామని మోదీ ప్రభుత్వం శపథం చేసిందని, ఇప్పుడు అదే పని చేస్తున్నదని అన్నారు. స్టీలు ప్లాంటు నేరుగా 36 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని, అందులో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు అమలు జరిపి 1500 మంది ఎస్టీ, 4వేల మంది ఎస్సీలకు ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. అంతే కాకుండా స్టీలు ప్లాంటు అనుబంధ పరిశ్రమల్లో మరో 50 వేల మందికి ఉపాధి కల్పించిందని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రానికి, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు తలమానికంగా ఉద్యోగ, ఆర్థిక భరోసాగా నిలిచిందని, స్టీలు ప్లాంటును నాశనం చేస్తే నేటి విద్యార్థుల భవిష్యత్తు శూన్యమే అవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్ సంఘాల నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం 1325 రోజులుగా పోరాటం జరుగుతుందని, ఆంధ్రుల ఆత్మగౌరానికి ప్రతీకగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వైఖరిలో ఏమాత్రం మార్పులేదన్నారు. కేంద్ర స్టీల్ మంత్రిత్వ శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు, మంత్రులు మాట్లాడుతున్న తీరు, రాజకీయ నాయకుల ప్రకటనలు చూస్తుంటే విశాఖ స్టీల్ ప్లాంట్‌పై పెద్ద కుట్ర జరుగుతున్నట్లు కనపడుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం చెబుతున్న దానికి చేస్తున్న దానికి పొంతన కుదరడం లేదని విమర్శించారు. బిజెపితో కలిసి రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చి లక్ష ఉద్యోగాలు సృష్టిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ స్టీల్ ప్లాంట్ సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి తిరుపతి లడ్డు కల్తీ నాటకానికి తెరతీశారని, కల్తీ జరిగితే కల్తీ చేసిన వారిని శిక్షించే అధికారం ఉన్నా ఆ పని చేయడం లేదని, చేయాల్సిన పని చేయకపోగా మతోన్మాదాన్ని ఎందుకు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఇకనైనా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని బిజెపి ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర అధికార, ప్రతిపక్ష పార్టీలు కూడా ప్రజల పక్షాన నిలవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ బి.రవికుమార్, డివైఎఫ్ఐ నాయకులు ఎం.వెంకటరమణ, ఎఐవైఎఫ్ నాయకులు బిటి నాయుడు, ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్ సింహాచలం, కె.డేవిడ్, సురేష్, శివ, శ్రీను, వెంకట్ మరియు కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమరవాణాపై కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం



ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో అందుబాటులో గల ఇసుక రవాణాకు బుకింగులు పెంచాలని తెలిపారు. ప్రభుత్వ పనులకు కావాల్సిన ఇసుక కోసం సంబంధిత శాఖల అధికారులు ఇండెంటు పెట్టాలని తెలిపారు. కొత్త ఇసుక రీచ్‌లను గుర్తించాలని, గుర్తించిన ఇసుక రీచ్‌ల్లో ఇసుకను వెలికితీసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వం అనుమతులతో వెడుతున్న ఇసుక వాహనాలకు ఇబ్బందులు కలిగించకూడదని పోలీసు అధికారులకు జిల్లా కలెక్టరు సూచించారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకరవాణా చేసే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేరేడి వద్ద పోలీసు చెక్ పోస్టు ఏర్పాటు చేయాలని తెలిపారు. డెలివరీకి అవసరమైన వాహనాలను వెంటనే సమకూర్చుకోవాలని రవాణాశాఖ అధికారులకు తెలిపారు. సమావేశంలో జాయింటు కలెక్టరు ఎస్.ఎస్. శోబిక, అదనపు ఎస్పీ డా. ఓ.దిలీప్ కిరణ్, పాలకొండ సబ్ కలెక్టరు ఎస్ యశ్వంత్ కుమార్‌రెడ్డి, డిఆర్ఒ జి.కేశవనాయుడు, మైనింగు, రవాణాశాఖ, ఇరిగేషను అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి మంత్రి పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

"పేదల సేవ" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన పంపిణీ చేసే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి సాలూరు పట్టణంలోని 26వ వార్డులో చెరువుగట్టు, వెంకటేశ్వర కాలనీలో మంగళవారం పాల్గొన్నారు. వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు తదితర అన్ని వర్గాల ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పింఛన్లు పెంచడంతో లబ్ధిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. జిల్లాలో 1.42 లక్షల మందికి రూ.59.37 కోట్లను పంపిణీ చేస్తున్నామని ఆమె చెప్పారు.

బెలగాం అగ్రహారంలో జిల్లా కలెక్టర్ పంపిణీ

పార్వతీపురం : పట్టణం బెలగాం అగ్రహారంలో పేదలకు సేవలో భాగంగా పింఛన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఒక్క రోజులోనే శత శాతం పంపిణీకి చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మున్సిపాలిటీలలో మున్సిపల్ కమిషనర్లు పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని నర్సిపురంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో

వృద్ధులకు పింఛను అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట నాయుడు మాజీ వైస్ ఎంపిపి గొట్టాపు గౌరి, ఎంపిటిసి ఏగిరెడ్డి తవిటి నాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రతి నెలా ప్రభుత్వం అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పేదవారికి ఆసరాగా ఉంటుందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని జెకెపాడులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు,టిడిపి నాయకులు తోయక దామోదర్, కద్రక రాజు, కంచర్ల భాను, ప్రసన్న ఉన్నారు.

డెంగీతో గిరిజన విద్యార్థి మృతి

ప్రజాశక్తి - కొమరాడ

మన్యం జిల్లాలో విష జ్వరాల బారిన పడి గిరిజన విద్యార్థులు మృత్యువాతపడుతున్న సంఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. వారం రోజులుగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ చివరికి మృత్యువుతో పోరాడి ఓడిపోయి మృత్యుఒడికి ఓ గిరిజన విద్యార్థి చేరింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న కొమరాడ మండలం జాకురుకు చెందిన కద్రక శారద (14) వారం రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం విశాఖ కెజిహెచ్‌లో మృతి చెందింది. పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ప్రకారం గతనెల 18 నుంచి శారద అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తండ్రి కంద్రిక నర్సింగు తెలిపారు. తన కుమార్తెకు అమ్మవారు సోకిందని ఇంటికి వెళ్లి వైద్యం చేయించుకుంటానని చెప్పినప్పటికీ ఇంటికి పంపించకుండా పాఠశాల సిబ్బంది పార్వతీపురం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారని తెలిపారు. రెండు రోజుల తర్వాత జ్వరం తగ్గిందని ఇంటి తీసుకు రాగా, మళ్లీ జ్వరం రావడంతో పాఠశాల సిబ్బంది ఆసుపత్రికి తీసుకువెళ్లి తనిఖీలు చేయగా, డెంగీ జ్వరం ఉన్నట్టు గుర్తించారు. వెంటనే చికిత్స అందించినా పరిస్థితి విషమించడంతో ఈనెల 25న విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో రోజురోజుకీ రక్తంలో ప్లేట్లెట్లు తగ్గిపోవడంతో మంగళవారం ఉదయం 7గంటల సమయంలో శారద మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం అక్కడి నుంచి మృతదేహాన్ని సొంతూరు జాకురుకు తరలించారు.

మంత్రికి వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు సుబ్బరావమ్మ, కార్మికులు

స్వీపర్లకు కనీస వేతనం రూ.700 చెల్లించాలి

సిఐటియు రాష్ట్ర నాయకులు సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - సాలూరురూరల్

జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు కనీస వేతనంగా రోజుకు రూ.700 చెల్లించాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి సిఐటియు రాష్ట్ర నాయకులు కె.సుబ్బరావమ్మ, యూనియన్ నాయకులు రంగు ముద్రి లక్ష్మీ వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. పాఠశాల స్వీపర్లకు సెలవుల్లో సగం జీతం, పని దినాల్లో రూ.6వేలు చెల్లిస్తున్నారని, కనీస వేతనం రోజుకు రూ.700 ఇవ్వాలని కోరారు. మున్సిపల్ పరిధిలోని నాయుడు వీధి, గుమడాం, గొల్ల వీధి, డబ్బివీధుల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు ఉద్యోగాలు కొనసాగి జీతాలను మున్సిపల్ కౌన్సిల్ ఆమోదంతో తీర్మానం చేయాలని కోరారు. అలాగే కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. వయసు పైబడి పని చేయని కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఆ ఉద్యోగం ఇప్పించాలన్నారు. సాలూరు మున్సిపాల్టీగా ఏర్పడి నాటినుండి రూ.50కే పని చేస్తున్నారని, ఇప్పటి వరకు చాలీచాలని జీతాలతో జీవితం గడుపుతున్నారని, పై సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి పత్రాన్ని అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల స్వీపర్ల సంఘం నాయకులు బి.హేమలత, విజయలక్ష్మి, అబద్ధం, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రిగా మార్చాలి

బొబ్బిలి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఆసుపత్రిగా మార్చాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో మంత్రిని కలిసి తిరుమల స్వామివారి ప్రసాదాన్ని అందించి బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి రోజురోజుకు రోగులు తాకిడి పెరుగుతున్న మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసి మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ఇంటికి పిలిపించుకోవడం స్వాతంత్ర్యమా ? : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ప్రజలకు సమస్యలు చెప్పుకునే స్వాతంత్ర్యం వచ్చిందని మంత్రి సంధ్యారాణి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. మంగళవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాదర్బార్ అనేది రాజరిక పాలనను గుర్తుచేస్తుందన్నారు. ప్రజాదర్బార్ పేరిట ప్రజలను ఇంటికి పిలిపించుకుంటున్నారన్నారని చెప్పారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి విధానాలకు తావులేదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, ప్రజల వద్దకే పాలకులు వెళ్లి సమస్యలు పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నప్పటికీ తాను ప్రతి గడపకి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నానని , సాధ్యమైనంత వరకు పరిష్కరించానని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజా దర్బార్ పేరిట ప్రజలనే మంత్రులు, ప్రజాప్రతినిధులు ఇంటికి పిలిపించుకొని హడావుడి చేస్తున్నారన్నారు. ప్రజాసమస్యలు పరిష్కరించకుండా గ్రీవెన్స్ ల పేరిట కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. ముగ్గురు ఐపిఎస్ అధికారులను సస్పెండ్ చేసిన సమయంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ స్వయంగా రెడ్‌బుక్ అనుసరించి సస్పెన్షన్ చేయడం జరిగిందని అన్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాసు పుస్తకాలు, వన్‌బిల్లో జగన్మోహన్ రెడ్డి బొమ్మ వేసుకున్నారని విమర్శించిన టిడిపి నాయకులు ఈరోజు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వన్‌బిల్‌పై ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి బొమ్మలు ఎందుకు వేశారన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన వైసిపిని విమర్శించడానికే సరిపోయిందని, క్షేత్రస్థాయిలో ప్రజలకు చేసిందేమి లేదని కెకె సర్వేసంస్థ అధినేత కొండేటి కిరణ్ అన్నారని గుర్తుచేశారు. విలేకరుల సమావేశంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, శివరాంపురం, పారన్నవలస సర్పంచులు జరజాపు మోహన్, చొంగలి లక్ష్మణ, కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు, వైసిపి నాయకులు వేణు తదితరులు ఉన్నారు.

మన్యంలో ఆగని డోలీ మోతలు

రోడ్డు సదుపాయాల్లేక తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి - కొమరాడ

మన్యం జిల్లాలో డోలీమోతలు యథాతథంగానే కొనసాగుతున్నాయి. గ్రామాలకు రోడ్డు సౌకర్యాల్లేకపోవడంతో ప్రజలు అనారోగ్యం బారినపడిన రోగులను డోలీలపై ఆసుపత్రులకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సంఘటనే మండలంలోని చినఖేర్జల పంచాయతీ సీసాడవలసలో చోటు చేసుకుంది. సీసాడవలసకు చెందిన కొండగొర్రె నికితకు పురిటి నొప్పులు రావడంతో వెంటనే ఆ గ్రామంలో ఉన్న ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు అగ్గమ్మ, వరలక్ష్మమ్మ స్పందించి 108కి ఫోన్ చేశారు. అయితే గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో చినఖేర్జల జంక్షన్ వరకు మంచపై ఆమె బంధులు మోసుకుంటూ తీసుకెళ్లారు. అనంతరం అక్కడి నుంచి పార్వతీపురం జిల్లా కేంద్ర హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో వెంటనే వైద్య సిబ్బంది స్పందించి కాన్పు అయ్యేదాకా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

రోడ్డు సదుపాయం లేకపోవడం దారుణం : సిపిఎం

దీర్ఘకాలంగా ఉన్న రోడ్డు సమస్యలను నేటికీ పరిష్కరించకపోవడం దారుణమని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి విమర్శించారు. కేవలం 350 మీటర్ల దూరానికి రోడ్డు వేయడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందని ఐటిడిఎ అధికారులను పాలకులు ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే గిరిజన గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని కోరారు.

మంచంపై మైదాన ప్రాంతానికి గర్భిణిని తీసుకొస్తున్న గ్రామస్తులు

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో మంగళవారం ఆర్చరీ జిల్లాస్థాయి పోటీ నిర్వహించారు వీటిలో సీతంపేట బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిలో 9వ తరగతి చదువుతున్న హిమరక లక్ష్మి, నీరజ, జ్యోత్స్న, 8 తరగతికి చెందిన మాధురి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపల్ అరుణ జ్యోతి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి హెచ్ ప్రసాద్ రావు, పీడీలు, గురుకుల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపికలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపికలను స్థానిక ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎపిఒ జి.చిన్నబాబు మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత, చురుకుదనం కలుగుతుందన్నారు. ఐటిడిఎ ద్వారా క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో ఈ ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలకు 150 మంది క్రీడాకారులు హాజరవ్వగా, 68 మందిని ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, డిడి అన్నదొర, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, ఐటిడిఎ స్పోర్ట్స్ ఎఒ జాకబ్ దయానంద్, పిఇటిలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు

బురద నీరు వద్దు.. మంచినీరు కావాలి

- నీటి సమస్యపై ర్యాలీ , కలెక్టరేట్ వద్ద ధర్నా
- పట్టణ ప్రజల పట్ల ప్రభుత్వ దారుణ నిర్లక్ష్యం
- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి- పార్వతీపురం

పట్టణానికి తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని, ఈ సమస్యను పరిష్కరించలేని ప్రభుత్వం ఒక ప్రభుత్వమేనా? అని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి విమర్శించారు. పట్టణంలో మంచినీటి సమస్య పరిష్కారానికై ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ పట్టణం జిల్లా కేంద్రమైన తర్వాత మరింత రెట్టింపుల్లో జనాభా పెరిగిందని, అయితే వారి అవసరాలకు తగ్గ సౌకర్యాలు లేవన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి మున్సిపల్, జిల్లా అధికారులు చర్యలు చేపట్టకపోవడం దారుణమని విమర్శించారు. పట్టణానికి తాగునీటి సరఫరా చేసే పంపులు, పైపులు, బేవర్ కెడ్ ,ట్యాంక్ సైజులు పెరగలేదని ఈ విధమైన పరిస్థితి ఉంటే నీటి అవసరాలు ఏ విధంగా తీర్చగలరని ప్రశ్నించారు. ఇది ప్రజల పట్ల ప్రభుత్వం దారుణ నిర్లక్ష్యంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. వారానికి రెండు, మూడు రోజులు నీటి సరఫరా చేస్తున్నారని, ఒక్కొక్కసారి పూర్తిగా రెండు వారాలకు ఒకసారి మాత్రమే అందిస్తున్నారని, అది కూడా బురద నీరు సరఫరాచేయడం అమానుషమని మండిపడ్డారు. పన్ను మాత్రం క్రమం తప్పకుండా మున్సిపాలిటీ అధికారులు వసూలు చేస్తున్నారని విమర్శించారు.

తాగునీటి సమస్య పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు, ఐద్వా నాయకులు

అనంతరం ఐద్వా నాయకులు రెడ్డి శ్రీదేవి, వి.ఇందిరా మాట్లాడుతూ పట్టణ ప్రజలు మంచి నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బురద నీరు తాగుతుండడం వల్ల అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అయినా ఉన్నతాధికారుల్లో ఎటువంటి చలనంలేదని విమర్శించారు. పట్టణ ప్రజల తక్షణ అవసమేగాక భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని తాగునీటిని పట్టణానికి సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వంద కోట్లు కేటాయించాలని, తాగునీటి సరఫరా షెల్టర్‌ను ఆధునీకరించాలని, ప్రతిరోజు శుద్ధి చేసిన నీటిని ఇవ్వాలని, కొత్తగా వెలసిన కాలనీలకు, అపార్ట్మెంట్లకు తాగునీటి కలెక్షన్ డిమాండ్ చేశారు. అలాగే చిట్లి పోయిన పైపులైన్లకు, జనరల్ పబ్లిక్ కుళాయిలకు మరమ్మతులు చేసి నీటి వృథాను ఆపాలని, ట్యాంకులతో సరఫరా చేసే ప్రాంతాలకు, కాలనీలకు రెగ్యులర్ గా ట్యాంకర్లను పంపేలా చర్యలు తీసుకోవాలని, కనెక్షన్లు ఉండి నీరు ఇవ్వని వారి నుండి నీటి పన్ను వసూలు చేయరాదని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌ఒ జి.కేశవ నాయుడుకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం జిల్లా నాయకులు బంటు దాసు, సిఐటియు జిల్లా కోశాధికారి జి వెంకటరమణ, సిఐటియు నాయకుడు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, లక్ష్మీపతిరాజు, ఐద్వా పట్టణ కమిటీ నాయకులు జి.తులసి, ఎం.గౌరి, కె. భవాని, జ్యోతి, జయ్యమ్మ, పి. ఉమా, రావనమ్మ, మంగ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల నిర్వహణ బాధ్యత రైతు కమిటీలదే

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎత్తిపోతల నిర్వహణ పూర్తి బాధ్యత రైతు కమిటీలదేనని శ్రీకాకుళం నీటిపారుదల సంస్థ కార్య నిర్వాహక ఇంజనీర్ కెవివి సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎపిఎస్ఐడిసి నిర్మించిన ఎత్తిపోతల పథకం బాధ్యత, నిర్వహణ రైతులు, రైతు కమిటీలకు అప్పగించడం జరిగిందన్నారు. నీటి తీరువా వసూలు చేసి ఎత్తిపోతల పథకం నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు. మండ పంచాయతీలోని జక్కరగూడ, రాయిమానుగూడ గ్రామాల గిరిజన రైతులు సుమారు వంద ఎకరాల్లో వరి, రాగులు, నువ్వులు, మొక్కజొన్న పండిస్తున్నారన్నారు. వీరికి ఎత్తిపోతల పథకం ద్వారా సకాలంలో నీటిని విడుదల చేయాలని సూచించారు. ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోందన్నారు. ఎత్తిపోతల పథకం నిర్వహణకు, రిపేర్లకు రైతు కమిటీలు 20 శాతం ఖర్చు భరించాలని, మిగిలిన మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. సీతంపేట మండలంలోని ఎంగుపేట ఎత్తిపోతల పథకానికి పంపులు, మోటార్లు, సర్వీసింగ్, ఇతర పనులకు సుమారు రూ.8లక్షలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించామని ఆ ప్రకటనలో తెలిపారు.

పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లేందుకు నిరీక్షిస్తున్న తల్లిదండ్రులు

సెలవులతో ఖాళీ అవుతున్న వసతి గృహాలు

ప్రజాశక్తి - మక్కువ

దసరా పండగ సందర్భంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో వసతి గృహాలు ఖాళీ అయ్యాయి. సెలవులు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకు వెళ్లేందుకు హాస్టళ్లకు వాహనాలతో రావడంతో పిల్లలు ఆనందంతో ఆ లింగనం చేసుకున్న దృశ్యాలు దర్శనమిస్తున్నాయి.

పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

పాఠశాల నుండి ఇంటికి చేరుకొనే పిల్లల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఇన్చార్జి ప్రిన్సిపల్ రత్నకుమారి అన్నారు. మండలంలోని ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు స్కూలుకు వచ్చేటప్పుడు ఏ విధంగా వస్తూ వెళ్తున్నారు తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని అన్నారు. ముఖ్యంగా ఇంటి వద్ద పిల్లలు చదువుతున్నారా లేదా పర్యవేక్షించాలన్నారు.

డిఇఒకు బహుభాష వాలంటీర్లు వినతి

ప్రజాశక్తి - సీతంపేట

ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ మాతృ బహు భాషా ఉపాధ్యాయులు సంఘం రాష్ట్ర కమిటీ తరుపున డిఇఒకు వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ మాతృ భాషను రాష్ట్ర విద్యా శాఖలో విలీనం చేసి చట్ట బద్ధతత చేయాలని డిమాండ్ చేశారు. ఒడిశా ప్రభుత్వం మాదిరిగా ప్రాథమిక విద్యను రాష్ట్ర ప్రభుత్వం అధీనంలో ఆదివాసీ మాతృభాషను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం కల్పించి ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి ఎస్.డొంబు, జిల్లా ఉమ్మిడి కార్యదర్శి ఆనందరావు, మాసయ్య, మండల కార్యదర్శి మాసయ్య, కురుపాం మండల కార్యదర్శి గౌరి, సహాయ కార్యదర్శి ఎ.దుర్గారావు. సహాయ కార్యదర్శి పాల్గొన్నారు.

నైట్ వాచ్‌మేన్‌కు సన్మానం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నైట్ వాచ్‌మేన్ బోనెల గౌరమ్మ మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని గౌరీ అధ్యక్షత వహించారు. నైట్ వాచ్మెన్‌గా ఆమె సేవలను కొనియాడారు. అలాగే ఇటీవల బదిలీపై వెళ్లిన అసిస్టెంట్ మాధవి, ఆఫీస్ సబార్డినేట్ గుణవతిని పాఠశాల సిబ్బంది సత్కరించారు.

సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

200 రోజులు పని దినాలు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి -వీరఘట్టం

ఉపాధి హామీ చట్టం ద్వారా 200 రోజులు పని దినాలు కల్పించాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం, సిపిఐ ఎంఎల్ లిబరేషన్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం గోర సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎం ఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు మాట్లాడుతూ దినసరి వేతనం రూ.500 ఇవ్వాలని, పెండింగ్లోని బిల్లులు చెల్లించాలని, అడవి, బంజరు, పోరంబోకు భూములకు పట్టాలివ్వాలని, ఇళ్లు లేని వారికి మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, భూమి లేని నిరుపేదలకు హెక్టారు భూమి ఇవ్వాలని, డిమాండ్ చేశారు. వీటితో పాటు మరిన్ని సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిలభారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గ్రంధి సూర్యనారాయణ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు ఎన్ విటలేశ్వరరావు, బి.ఆదినారాయణ, నిమ్మక సత్యం, బి.సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల బదిలీలు అన్యాయం

ప్రజాశక్తి - కురుపాం

రాజకీయ కక్షలతో కురుపాం, గుమ్మ లక్ష్మీపురం మండలాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను, వీఆర్వోలను అంతర్ జిల్లాలు బదిలీలు చేయడం అన్యాయమని గిరిజన సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కురుపాం విలేకరులతో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో పీసా చట్టం, జిఒలు పగడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ అమలుచేయడంలేదన్నారు. గిరిజన ఉద్యోగులు గిరిజన ప్రాంతంలో ఉండాలని చట్టాలకు జీవోల్లో ఉన్నప్పటికీ వాటికి వ్యతిరేకంగా రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు అంతర్ జిల్లాలు బదిలీ చేయడం అన్యాయమని అన్నారు. కావున అధికారులు, ప్రజాప్రతినిధులు పునరాలోచించి గిరిజన ప్రాంతంలో గిరిజన ఉద్యోగులే ఉండేలా చూడాలని గిరిజన సంఘం తరపున కోరారు.

ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈనెల 4న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు మండలంలో గల భవన కార్మికులు ట్రాక్టర్ కార్మికులు ఇతర పెయింటింగ్ పనులు చేస్తున్న కార్మికులు పెద్ద ఎత్తున ధర్నాకు కదలి రావాలని పిలుపునిచ్చారు.

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి వాహనాలు నడపాలని నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు అన్నారు. మంగళవారం నీలకంఠాపురంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరిస్తే ప్రాణం జరగకుండా ఉంటాదని, కావున తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే దసరా పండగ సందర్భంలో వాహనాలపై వెళ్లేటప్పుడు జాగ్రత్తగా వెళ్లాలని బంధువుల ఇళ్లకు వెళ్లే వారు ఇంట్లో విలువైన ఆభరణాలు పట్ల జాగ్రత వహించి వారు వెళ్తున్న సమాచారాన్ని పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలన్నారు. కార్యక్రమం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలకంఠరావు

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రావికోన గ్రామ గిరిజనులు

విఒఎలను కొనసాగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని రావికోన పంచాయతీ విఒఎ కన్యాకుమారిని కొనసాగించాలని, సంఘం సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేసిన సిసిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం డ్వాక్రా మహిళలు స్థానిక డిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, పిడి సత్యం నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కద్రక రామస్వామి, శ్రామిక మహిళా సంఘం నాయకురాలు వి.ఇందిరా మాట్లాడుతూ రావికోన పంచాయతీలో పనిచేస్తున్న విఒఎను మానసికంగా, రాజకీయంగా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. గ్రూపు సభ్యుల సంతకాలు సీసీ ఫోర్జరీ చేసి ఎపిఎం రాజకీయ నాయకులు చెప్పినట్టు విఒఎలను మానసికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. గ్రామ సభలు జరపకుండా గ్రామైక్య సంఘాల సంతకాలు లేకుండా తీర్మానం ఎలా చేశారని ప్రశ్నించారు. సర్పంచికి తెలియకుండా ఇలా చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా విఒఎ కన్యాకుమారిని కొనసాగించాలని కలెక్టర్, వెలుగు పీడీకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, ఐద్వా నాయకులు రెడ్డి శ్రీదేవి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలో అక్రమంగా తొలగించిన దళాయిపేట విఒఎను వెంటనే విధులోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. తొలగించిన విఒఎను విధులకు తీసుకోవాలని కోరుతూ స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ముంజి స్వర్ణకుమారిని కక్ష సాధింపు చర్యల్లో తొలగించడం అన్యాయమని కాబట్టి వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని ఎపిఎం రమణను కోరారు. దీనికి ఎపిఒ స్పందిస్తూ 12 మహిళా సంఘాల సభ్యులు తీర్మానం ప్రకారం స్వర్ణ కుమారిని తొలగించి శెట్టి కళ్యాణిని నియమించినట్టు తెలిపారు. దీనికి సిఐటియు, మహిళా సంఘం నాయకులు మాట్లాడుతూ సుమారు 48 గ్రూపులుండగా కేవలం 12 గ్రూపులు తీర్మానం ప్రకారం ఎలా స్వర్ణకుమారిని తొలగిస్తారని ప్రశ్నించారు. ఇలాంటి సందర్భంలో కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. తక్షణమే గ్రూపులందరితో సమావేశం ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి విఎఒ స్వర్ణ కుమారికి న్యాయం చేయాలని, లేకుంటే ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. అంతేకాక ఈ విషయమై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

మండల స్థాయి చెకుముకి పోటీలు విజయవంతం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జనవిజ్ఞాన వేదిక మన్యం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం 15 మండలాల్లో మండల స్థాయి చెకుముకి పరీక్ష నిర్వహించినట్లు జనవిజ్ఞాన వేదిక మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొండపల్లి గౌరునాయుడు, సార్తి మహేశ్వరరావు తెలిపారు. 15 మండలాల్లో 450 మంది విద్యార్థులు, టీముకు ముగ్గురు చొప్పున 150 మంది పరీక్షకు హాజరైనట్టు వారు తెలిపారు. మండల స్థాయి పరీక్షలో ప్రథమ స్థానం పొందిన టీం ఆ మండలం నుంచి అక్టోబర్ 27న జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి పరీక్షకు అర్హత సాధించినట్లు వారు తెలిపారు.

మక్కువ : చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో భాగంగా మండలంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ మండల స్థాయి పరీక్ష స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మొదటిగా సెప్టెంబర్ 25న పాఠశాల స్థాయిలో మండలంలో గల అన్ని ఉన్నత పాఠశాలల్లో 8,9,10 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించగా, 580 మంది విద్యార్థులు హాజరయ్యారు. వివిధ పాఠశాలల్లో ఆయా తరగతుల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేశారు. మక్కువ విద్యార్థుల జట్టు ఆర్.జ్యోత్న్న, కె.శిరీష, బి.కావ్య మొదటి స్థానంలో నిలవగా, శంబర పాఠశాల విద్యార్థులు సిహెచ్ చిరంజీవి, ఎస్.అనూష, జి.అక్షయ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఎంఇఒలు బహుమతులనుఅ ందజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు ఆర్.రమేష్, జి.రామారావు, ఎస్.రాంబాబు, వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి వేడుకలు ఘనంగా ముగిసాయి. మండలంలోని ఏడు ఉన్నత

సీతానగరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెవివి నాయకులు

పార్వతీపురంలో ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, నిడగల్లు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకున్నారు. ఇందులోభాగంగా పదో తరగతికి చెందిన కె.ప్రవీణ్ కుమార్, 9వ తరగతి చదువుతున్న వి.అనుష్క, 8వ తరగతికి చెందిన వి.సంజన విజేతలుగా నిలిచారు. వీరికి ఆర్‌కె జూనియర్ కరస్పాండెంట్ పూడి రామకష్ణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెవివి ఉపాధ్యక్షులు రేవళ్ల సతీష్ రాజు తెలిపారు.

భామిని : స్థానిక ఆదర్శ పాఠశాలలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహించారు. ఈ మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ రఘు పాత్రను శివకుమార్ తెలిపారు. మండల స్థాయి పోటీలు అనంతరం ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర)లో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మహేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సూరు సతీష్ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సంబరాలు పరీక్ష నిర్వహించారు. పరీక్ష పత్రాలను ఎంఇఒ ఆనందరావు, పాఠశాల హెచ్‌ఎం బి.సుంబర, జెవివి నాయకులు ఆవిష్కరించారు. ఈ పరీక్షలు గెలుపొందిన విజేతలు ఈనెల 27న పార్వతీపురంలో జరిగే జిల్లా హాజరౌతారని నిర్వహకులు తెలిపారు. జిల్లాస్థాయి పరీక్షకు ఎంపికైన నర్సిపురం, మహర్షి హై స్కూల్లో విద్యార్థులను ఎంఇఒలు గౌరు నాయుడు, ఆనందరావు, జెవివి జిల్లా అధ్యక్షులు కొండపల్లి గౌరు నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్.మహేశ్వరరావు, ఉపాధ్యక్షులు బి.గౌరీశ్వరరావు, మండల ఇన్చార్జి సూరు సతీష్ అభినందనలు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - భామిని

శ్రీకాకుళంలోనిఆర్ట్స్ కళాశాల వేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి నుండి క్రికెట్‌లో అండర్- 19 విభాగంలో జి అభిరామ్, జి ఉదయ్ కుమార్, చెస్ అండర్-19 విభాగంలో బి.ఓంకార్, అండర్ 17 విభాగంలో వి.కార్తికేయ, బాక్సింగ్ అండర్-19 విభాగంలో స్నేహశాంత్రా, పి.స్రవంతి, అండర్-17 విభాగంలో ఎన్‌కె శాంతి కుమారి, హాకీ అండర్ -19 విభాగంలో ఎన్.దేవకి, అండర్ 17 విభాగంలో బి.లావణ్య, కబడ్డీ అండర్ 19 విభాగంలో ఎ.రిబిక రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు.

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర)లో మంగళవారం జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మహేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సూరు సతీష్ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సంబరాలు పరీక్ష నిర్వహించారు. ఎంఇఒ ఆనందరావు, పాఠశాల హెచ్‌ఎం బి.సుంబర, జెవివి నాయకులు పరీక్షకు హాజరైన పరీక్ష పత్రాలను ఆవిష్కరించారు. మండలస్థాయి విజేతలు ఈనెల 27న పార్వతీపురంలో జరిగే జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు కొండపల్లి గౌరు నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్.మహేశ్వరరావు, ఉపాధ్యక్షులు గౌరీశ్వరరావు , మండల ఇన్చార్జి సూరు సతీష్ పాల్గొన్నారు.

చిదిమిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమిలో స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులతో పాటు రక్తపోటు, మధుమేహ తదితర వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతికుమారి, ఎఎన్ఎం ఎం.సరస్వతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయాణం నరకం

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టం-పాలకొండ ప్రధాన రహదారిలో భారీ వాహన రాకపోకల వల్ల వండవ వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. రహదారంతా పెద్దపెద్ద గోతులు ఏర్పడడం వర్షం నీరు అందులో చేరిపోవడంతో ఆ గోతుల్లో వాహనాలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి గోతులు పూడ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి సాయికృష్ణ హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని విక్రం పురంలోని లేఅవుట్లో చేపడుతున్న నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన గృహ నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించి, పనులు పూర్తి చేయాలన్నారు. ప్రారంభమైన గృహ నిర్మాణాన్ని నిర్ణీత సమయానికి పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వీరఘట్టంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ప్రత్యేక అధికారితో పాటు ఎంపిడిఒ వై.వెంకటరమణ, గృహ నిర్మాణశాఖ ఇఇ వినోద్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర రావు ఉన్నారు.

వృద్ధులకు ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి డాక్టర్ నగేష్ రెడ్డి మంగళవారం వృద్ధుల కోసం ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించగా, పది మందికి దృష్టి దోషం ఉన్న వారిని గుర్తించి కళ్ల జోళ్ల కొరకు సిఫార్సు చేశామన్నారు. 9మందికి అంతర కుసుమం లోపం ఉన్న వారికి శస్త్ర చికిత్సలు అవసరమై ఉందని, వారికి త్వరలో శస్త్ర చికిత్సలు చేయిస్తామని అన్నారు. కంటి చూపును కాపాడుకునేందుకు కంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేత్ర దానంపై అవగాహన తదితర అంశాలపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర సురేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోందిలో ప్రకృతి సేద్యం

ప్రజాశక్తి - పాచిపెంట

గిరిజన రైతులు పూర్తిస్థాయి ప్రకృతి సేద్యాన్ని ఆచరించాలని, ఎలాంటి రసాయనాలు లేని చిరుధాన్యాలకు మంచి గిరాకీ ఉందని ప్రభుత్వం ప్రకృతి సేద్య పద్ధతుల్లో పండించిన పంటల ఉత్పత్తులకు ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ సదుపాయాలను కూడా కల్పిస్తుందని సాలూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదనరావు అన్నారు. మండలంలోని బొర్ర మామిడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ నవధాన్యాలు, కషాయాలు బీజామృతాలు, జీవామృతాలు, పసుపు, పళ్లాలు వంటి ప్రకృతి సేద్య స్టాల్‌ను మొట్టమొదటిసారిగా రైతుల కోసమే ఏర్పాటు చేశారని, వీటి గురించి తెలుసుకొని ఆచరించినట్లయితే ఎలాంటి ఖర్చు లేకుండా దిగుబడులు పెంచుకోవచ్చని తెలిపారు. అనంతరం చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఒ కె.తిరుపతిరావు, విఎఎ భారతి, ప్రకృతి సేద్య ప్రతినిధులు సురేష్, తిరుపతినాయుడు, విజయ్, సూర్యారావు, రాజు, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని కొత్తవలసలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌సి ఎడిఎ శ్రీనివాసు, ఎఒ అవినాష్ మాట్లాడుతూ రైతులు పంటలు మార్పిడి చేసుకుంటే భూమిలో పోషకాల సమతుల్యంగా ఉంటాయని అలాగే రైతులు ఉలవలు, కాబూల్, కొమ్ము శెనగలు, నువ్వులు పంటలకు మార్పిడి చేసుకుంటే భూమితో పాటు రైతులు కూడా ఆర్థికంగా మెరుగుపడతారని తెలిపారు. విత్తనాలు అందుబాటులో పెడతామన్నారు. కావాల్సిన రైతులు విఎఎలకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిటిఎన్ఎఫ్ సిబ్బంది, పశుసంర్ధకశాఖ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని తెట్టంగిలో పాలకొండ ఎడిఎ రత్నకుమారి ఆధ్వర్యంలో పోలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించి పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని, ఆ దిశగా అవగాహన పెంపొందించుకొని పంటల సాగు చేయాలని రైతులకు సూచించారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బాతు గుడబ, రాయగడ జమ్ములో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిపిఎంపి షణ్ముఖ రాజు హాజరై బాతుగుడబ, గొరడలో రైతులు కిల్లక సత్యం తాడంగి కామేశ్వరరావు సాగు చేస్తున్న శ్రీవరి పంటలను పరిశీలించారు. ఎఒ సిహెచ్ ప్రసాద్ , కెవికె శాస్త్రవేత్త డాక్టర్ ఎం .అనంత, విహారి, ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, జట్టు ట్రస్ట్ కో-ఆర్డినేటర్ జి.మురళీ మోహన్, రిసోర్స్ పర్సన్ యశోదా దేవి, గీత, ఎంపిటిసి ఎం.భీమారావు ఉన్నారు.

సాలూరురూరల్ : మండలంలోని కురుకుట్టి, సారిక రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ అనురాధ పండా మాట్లాడుతూ రైతులకు సూక్ష్మ సేద్యం నిమిత్తం డ్రిప్, స్ప్రింకర్లు ను సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తుందని, వీటిని కావలసిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి బి.ఝాన్సీ, వెటర్నరీ సైంటిస్ట్ అను, కురుకూటి, సారిక సర్పంచులు ,రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి తలుపులు వేసి...

యజమానులపై దాడి

చెముడులో బీభత్సం

కారులో పరారైన గుర్తు తెలియని వ్యక్తులు

ప్రజాశక్తి - మక్కువ

అచ్చం సినిమాలో చూపించినట్లుగానే కొంత మంది వ్యక్తులు ఇంటిలో ప్రవేశించి తలుపులు మూసి ఇంటి యజమానులపై దాడి చేసి ఇంట్లో వస్తువులన్నీ ధ్వంసం చేసిన ఘటన మండలంలో సంచలనం రేపింది. ఏం జరిగిందో తేరుకునే లోపే వచ్చిన దుండగులు కారులో పరారైన ఘటన మండలంలోలని చెముడులోని మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం

దుండగులు ధ్వంసం చేసిన టీవీ, గృహోపకరాలు

మండలంలోని చెముడులో కర్ర వీధిలో గొట్టాపు మనోహర్, కృష్ణ అన్నదమ్ములు నివాసం ఉంటున్నారు. మనోహర్ పెద్ద కుమారుడికి వివాహం కూడా నిశ్చయం కావడంతో ఆ పనుల్లో వారు నిమగ్నమై ఉన్నారు. మంగళవారం సాయంత్రం గ్రామంలోకి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మనోహర్ ఇంట్లో చొరబడి ఇంటి తలుపులు మూసి దొరికిన వారిని దొరికినట్లుగా దాడి చేసి బీభత్సం సృష్టించినట్లు తెలిసింది. ఇంట్లో ఉన్న గృహోపకరణాలను సైతం విడిచిపెట్టకుండా ధ్వంసం చేసినట్లు తెలిసింది. దాడిలో మనోహర్, కృష్ణ గాయపడ్డారు. వెంటనే వీరిని శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వెళ్లగా వారికి వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసి సాలూరు సిహెచ్‌సికి రిఫర్ చేసినట్లు తెలిసింది. అయితే స్థానికంగా ఈ దాడి కలకలం రేపింది. ఇప్పటివరకు మండలంలో ఈ తరహా దాడులు జరగడం ఇదే ప్రథమం. దీంతో చెముడు గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. తమపై దాడి జరిగిన విషయమై స్థానిక పోలీసులు మనోహర్, కృష్ణ మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి నిజానిజాలు తేలాల్సి ఉంది.